క్లుప్తంగా

డాక్టర్ మురళీధర రెడ్డికి బాలినేని పరామర్శ



డాక్టర్ మురళీధరరెడ్డితో మాట్లాడుతున్న మాజీ మంత్రి బాలినేని

ఒంగోలు: చందమామ హాస్పిటల్ డాక్టర్ మురళీధరరెడ్డిని మాజీమంత్రి, ఒంగోలు శాసనసభ్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. డాక్టర్ మురళీధరరెడ్డి తల్లి మరణించినట్లు తెలుసుకున్న బాలినేని నేరుగా మురళీధరరెడ్డి నివాసానికి చేరుకుని భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొద్దిసేపు ఆయనతో మాట్లాడి పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

ఒంగోలు: ఆర్టీసీ డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఒంగోలు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను నేరుగా చెప్పుకోదలుచుకున్నవారు 5225695 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. అదే విధంగా అరుణాచలం స్పెషల్ బస్ ఈనెల 31వ తేదీ ఒంగోలు బస్టాండు నుంచి బయలు దేరుతుందని, కనుక టిక్కెట్లు సర్వీస్ నెంబర్ 95909కు బుక్ చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ అదాలత్

మద్దిపాడు: స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో 28వ తేదీ శుక్రవారం ఉదయం విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఏఈ రవి ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లుల సమస్యలు లోటల్టేజ్, ఇతర సమస్యలున్న వారు విద్యుత్ అదాలత్‌లో రాత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని కోరారు. జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ కేవీజీ సత్యన్నారాయణ, కె. సుబ్బారావు పి. శ్రీనివాసరావు, ఆర్. మోహనరావు, డీఈఈ కె. చిన్నబాబు ఏఓ పాల్గొంటారని తెలిపారు.

31న సర్వసభ్య సమావేశం

చీమకుర్తి: మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం ఈనెల 31న మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో జరుగుతుందని కమిషనర్ ఫజులుల్లా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొనాలని తెలిపారు.

దివ్యాంగునికి ఆర్థిక చేయూత

ఒంగోలు అర్బన్: పుట్టు దివ్యాంగుడైన చవడవరం శ్రీనివాసచారి చదువుకునేందుకు సూర్యశ్రీ ట్రస్టు రూ.20 వేల ఆర్థిక సహాయం ట్రస్టు కార్యాలయంలో గురువారం అందించారు. దివ్యాంగుడైనా చదువుకోవాలని ఆసక్తి ఉన్నా పేదరికంతో చదువుకోలేకపోతున్న విషయం తెలుసుకున్న ట్రస్టు సభ్యులు సహాయం అందించారు. పేద విద్యార్థులకు ట్రస్టు నిరంతరం అండగా ఉంటుందని తెలిపారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, ట్రస్టు చైర్మన్ షహనాజ్, సెక్రటరీ షేక్ సర్దార్ బాషా, జాన్‌టాస్, భాను, సుధాకర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్

ఒంగోలు అర్బన్: జిల్లాలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని నిర్ణయించిందని కలెక్టర్ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. కలెక్టర్ ఆధ్వర్యంలో 28వ తేదీ స్పందన భవనంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు దీనికి జిల్లా అధికారులు హాజరవుతారని ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు.

పోలీసులకు సమాచారం ఇచ్చారని దాడి

ఒంగోలు టౌన్: మద్యం విక్రయాల గురించి పోలీసులకు సమాచారం ఇచ్చిన వ్యక్తిపై దాడి చేసిన ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని సమైక్యానగర్‌లో పెండ్యాల శ్రీనివాస్ పెయింటర్ పనిచేస్తుంటాడు. అదే వీధిలోని కె.ప్రతాప్, విజయ్ ఉరఫ్ పల్లోడు అనే వ్యక్తులు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కక్ష పెంచుకున్న వారు బుధవారం ఒక ఆటోలో వచ్చి శ్రీనివాస్ ఇంటి ముందు నిల్చొని మద్యం సేవించసాగారు. దీనికి అభ్యంతరం చెప్పిన శ్రీనివాస్‌పై దాడి చేసి కొట్టారు. ఇటుకరాయితో తలపై కొట్టడంతో గాయమైంది. బంధువులు, చుట్టుపక్కలవారు రావడంతో వారు పారిపోయారు. రక్తస్రావం అవుతున్న శ్రీనివాస్‌ను వెంటనే రిమ్స్‌కు తరలించి చికిత్స చేస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు భళా.. ఆనందం ఇలా!

- ఎమ్మెల్యే బాలినేని చొరవతో చేజర్ల–ఆలూరు రోడ్డు నిర్మాణం పూర్తి
- ఒంగోలు నగరానికి రైమంటూ రానున్న పల్లె జనం



చేజర్ల-ఆలూరు రోడ్డు

ఒంగోలు రూరల్: ఒంగోలు ఎమ్మెల్యే మాజీ మంత్రి బాలినేని ముందు చూపుతో చేజర్ల అభివృద్ధి దిశగా అడుగులు వేసింది. ఒంగోలు రూరల్, కొత్తపట్నం మండలం, ఒంగోలు నగరం కలిపేలా నూతన లింక్ రోడ్డు నిర్మాణానికి ఆయన నిధులు కేటాయించారు. దీంతో పటిష్టమైన రోడ్డు నిర్మాణం పూర్తయింది. కొన్ని దశాబ్దాలుగా ఎండాకాలం, వర్షాకాలాల్లో కాలిబాటన వ్యవసాయ పొలాలకు వెళ్ళే రైతులు ఇబ్బంది పడేవారు. ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు అన్ని గ్రామాలతో రోడ్డు సంబంధాలు తెగిపోయి నిత్యావసరాలకై విలవిల్లాడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. గత ప్రభుత్వాలు డొంక రోడ్డుగా ఉన్న ఈ లింక్ రోడ్డును కనీసం మట్టి రోడ్డుగా అయినా మార్చే ప్రయత్నం చేయలేదు. ఈ క్రమంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి స్పందించి లింక్ రోడ్డు అభివృద్ధికై దృష్టి సాధించారు. చేజర్ల సర్పంచ్‌గా ఎంపికైన స్థానికుడు, విద్యాధికుడు చాగంటి రవికుమార్ రెడ్డి చేజర్ల అభివృద్ధి ప్రణాళికలను బాలినేని దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన చేజర్ల–ఆలూరు డొంక రోడ్డును తారు రోడ్డుగా రూపొందించేందుకు పూర్తిస్థాయి అనుమతులు ఇవ్వడంతో 5.50 కిలోమీటర్ల మేర చేపట్టిన రోడ్డు నిర్మాణం ఫిబ్రవరిలో పూర్తయింది. రూ.9 కోట్లతో తిరుపతికి చెందిన డీడీఆర్ కంపెనీ అత్యంత పటిష్టంగా నాణ్యతాపరమైన లోపాలు లేకుండా ఏర్పాటు చేసింది. 5 ఏళ్ల పాటు ఈ రోడ్డు నిర్వహణ బాధ్యతలు ఆ కంపెనీ చూసుకుంటుంది. చేజర్ల–ఆలూరు రోడ్డు వలన కొత్తపట్నం, మోటుమాల, ఆలూరుకు పూర్తి స్థాయి సంబంధాలు ఏర్పడ్డాయి. అంతేకాకుండా చేజర్ల నుంచి ఒంగోలు మండల తీరప్రాంత గ్రామాల వారికి కొత్తపట్నం మండలంతో రోడ్డు సంబంధాలు ఏర్పడ్డాయి.

తీరప్రాంత గ్రామాలతో కనెక్టివిటీ

చేజర్ల గ్రామం వరకు ఏర్పడ్డ రోడ్డును చేజర్ల ఎత్తిపోతల పథకం వరకు పొడిగించడంతో ఒంగోలు రోడ్డు మార్గంతో రోడ్డు కలిసింది. ఈ డొంక రోడ్డును తారు రోడ్డుగా మార్చడంతో గుండ్లకమ్మ వద్ద గల చేజర్ల ఎత్తిపోతల పథకం నుంచి తారురోడ్డు మార్గం ఏర్పడింది. దీంతో మండలంలోని అన్ని గ్రామాలకు తక్కువ సమయంలో చేరుకునే అవకాశం ఏర్పడింది.

బస్సు సౌకర్యం కోసం చర్యలు



2020–21 న తిరుపతి కి చెందిన డీడీఆర్ కంపెనీ పనులు చేపట్టింది. తొలుత ఈ రోడ్డు ప్రాథమిక పనులు రోడ్డు ఎత్తు పెంచే పనులు చేపట్టి రోలింగ్ అనంతరం తారురోడ్డు పూర్తి చేశారు. ఆర్టీసీ బస్సు కోసం బాలినేని తగు చర్యలు తీసుకోనున్నారు.

– రవికుమార్ రెడ్డి, సర్పంచ్

రైతులకు పొగాకు పంట



వేలం కేంద్రంలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన పొగాకు బేళ్లు (ఫైల్)

ఒంగోలు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా గతంలో ఎన్నడూ లేని విధంగా కిలో పొగాకు ధర రూ.250 పైబడి పలుకుతోంది. గత ప్రభుత్వంలో పొగాకు గిట్టుబాటు ధర కోసం రోడ్డెక్కిన సంఘటనలు లాఠీలతో దెబ్బలు తిన్నా.. పెట్టుబడులు కూడా రాక అప్పుల పాలైన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అయితే గత నెల నాలుగు సంవత్సరాలుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్థిరమైన గిట్టుబాటు ధర లభిస్తోంది. 2022–23 సంవత్సరంలో భారీ వర్షాలకు కుళ్లిపోయిన పొగ తోటలు తీసివేసి మరలా మరలా మూడుసార్లు పొగ తోటలు వేసిన రైతులు ఈ ఏడు అత్యంత లాభసాటిగా వేలం కేంద్రాల్లో అమ్మకాలు కొనుగోళ్లు జరుపుతున్నారు. గత పదేళ్ళుగా కరువు విళయతాండవం చేస్తుండగా పొగాకు వేసిన రైతులు దిగుబడి రాక అప్పుల ఊబిలో కూరుకుపోయారు. మరోవైపు అమ్మకాలు కొనుగోళ్లు జరిగినా దళారీలు రైతులకు గిట్టుబాటు ధర రాకుండా సిండికేట్‌గా మారి అమ్మకాలు కొనుగోళ్లు నిర్వహించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో సిండికేట్‌లను నిలువరించి నంబరు పొగాకు దగ్గర నుంచి చూర పొగాకు వరకు తప్పనిసరిగి కొనుగోళ్లు చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో సరాసరి ధర రూ.200 స్థిరంగా ఉంది. పొగాకు ఉత్పత్తిదారుల చైర్మన్ వాకా బసివిరెడ్డి, పొగాకు బోర్డు మెంబరు మారెడ్డి సుబ్బారెడ్డి రైతుల పక్షాన ఉండి కంపెనీలు ధర దిగజార్చకుండా పర్యవేక్షించారు. ఒంగోలు వేలం కేంద్రం–2లో గురువారం కిలో పొగాకు అత్యధిక ధర రూ.269 పలుకగా, కనిష్ఠ ధర రూ.160, సరాసరి ధర రూ.147.96 పలుకడం రికార్డు. కేంద్రానికి మొత్తం బేళ్ళు 794 రాగా, కొనుగోళ్లు 730 జరిగాయి. 12 బేళ్ళు నోబిడ్ అయ్యాయని వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి



కొత్తపట్నం: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బీఎల్‌వోలు సర్వే చేయాలని తహసీల్దార్ బీవీ రమణారావు అన్నారు. గురువారం తహసీల్దార్ విలేకర్లతో మాట్లాడుతూ మూడు రోజుల నుంచి ఇంటింటి సర్వే జరుగుతోందని అర్హులైన ఓటు హక్కు కల్పించాలని కోరారు. మండలంలో 53 బూత్‌లు గాను 41,461 మంది ఓటర్లున్నారని అందులో పురుషులు 20,399, స్త్రీలు 21,062 మంది ఉన్నారని తెలిపారు. ఇంటింట సర్వే పాదర్శకంగా చేసి ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించాలని కోరారు. జాబితాలోని సవరణలు, డిలేషన్, యాడింగ్స్, మైగ్రేషన్ వంటివి జాగ్రత్తగా పరిశీలించాలని చెప్పారు. అన్ని ఓట్లకు ఆధార్ అనుసంధానం చేయాలని ఆదేశించారు. బూత్ లెవల్ సూపర్‌వైజర్లు కూడ బీఎల్‌వోపై పర్యవేక్షించాలని కోరారు. సర్వేను ఇళ్లకు వెళ్లి వేగవంతగా జరగాలని ఆదేశించారు.

సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలో వివిధ తరగతుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు గిరిజన బాల బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శామ్యూల్‌జోబు తెలిపారు. 6వ తరగతిలో 16 మంది బాలికలు, 2 బాలుర సీట్లు, 7వ తరగతిలో 1 బాలురు, 1 బాలికల సీట్లు, 8వ తరగతిలో 1 బాలిక, 4 బాలుర సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. దీంతో పాటు ఇంటర్ మొదటి సంవత్సరం హెచ్‌ఈపీ–4 సీట్లు, ఎంపీసీ–4 సీట్లు ప్రవేశం కోసం ఈ నెల 29వ తేదీ లోపు 80966 25818 నంబర్‌కు పూర్తి వివరాలతో వాట్సప్ చేయాలని ఆయన కోరారు.

ఉద్యాన పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన

దర్శి: ఉద్యాన పంటలు, వ్యవసాయ పంటలపై యాజమాన్య పద్ధతులపై రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం కృషి విజ్ఞాన కేంద్రంలో జరిగింది. కార్యక్రమానికి కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎన్‌వీవీఎస్ దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజస్థాన్‌లోని శిఖర్ ప్రాంతంలో పీఎం కిసాన్ నిధులు విడుదల కార్యక్రమం చేపట్టారన్నారు. రైతులు అడిగిన ప్రశ్నలకు శాస్త్రవేత్తలు సమాధానాలు చెప్పారు. డాక్టర్ ఎం.ఉషా, డాక్టర్ ఎం.శివ, డాక్టర్ టీవీ రెడ్డి, డాక్టర్ ఎన్.లీలాకృష్ణ, టి.మానస, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డి.కోటేశ్వరరావు, జి.నాగమణి పాల్గొన్నారు.

స్కూలు డ్రాప్ అవుట్స్ గుర్తింపు



జాబితాలను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, పక్కన సిబ్బంది

ఒంగోలు సబర్బన్: నగరంలోని మున్సిపల్ పాఠశాలల వారీగా స్కూలు డ్రాప్ అవుట్స్‌ను గుర్తిస్తున్నట్లు ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు. గురువారం విరాట్ నగర్‌లోని స్కూలు డ్రాప్ అవుట్ స్టూడెంట్స్ లిస్టులను పరిశీలించారు. నగరంలో మొత్తం డ్రాప్ అవుట్స్ 147 ఉన్నారని గుర్తించారు. వారిలో 106 మంది ఇతర ప్రాంతాలకు వెళ్ళారని గుర్తించినట్లు పేర్కొన్నారు. మిగతా 41 మంది విద్యార్థులు రెండు రోజుల్లో తిరిగి పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. విరాట్ నగర్‌లోని పాఠశాలకు ప్రహరీ లేదని హెచ్‌ఎం, కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు.

నవరత్నాల అర్హుల జాబితాల పరిశీలన

నగరంలోని వార్డు సచివాలయాల్లో ప్రదర్శించిన నవరత్నాల పథకాలకు సంబంధించి వివిధ పథకాలకు అర్హులైన వారి జాబితాలను కమిషనర్ పరిశీలించారు. ఈ మేరకు 44వ డివిజన్‌లోని మారుతి నగర్ సచివాలయాన్ని సందర్శించారు. కాపు నేస్తంకు సంబంధించిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మారుతి నగర్ సచివాలయం పరిధిలో మొత్తం 24 మంది ఉన్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్పొరేటర్ గోపాల్ రెడ్డితో పాటు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

బీసీ సంక్షేమ శాఖ అధికారికి సన్మానం

ఒంగోలు: బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎం.అంజలను ఎస్సీ, ఎస్టీ, బీసీ నాలుగో తరగతి ఉద్యోగ సంఘ నాయకులు గురువారం ఆమెను సంక్షేమ శాఖ జిల్లా అధికారి చాంబర్‌లో కలిసి సత్కరించారు. నూతనంగా ఎన్నికైన సంఘ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. నూతన జిల్లా అధ్యక్షుడు ఆంధ్ర తిరుపతయ్య, కార్యదర్శి దాసరి ప్రేమ్‌కుమార్, కోశాధికారి నక్కా శ్రీను, కమిటీ సభ్యులు మాట్లాడుతూ నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో చొరవ చూపి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ సంఘ సభ్యుల సమస్యల పరిష్కారంలో జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులను కలిసి కృషి చేస్తానని, సంఘ అభివృద్ధికి పాటుపడతానని పేర్కొన్నారు.



బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి అంజలను సత్కరిస్తున్న నాయకులు

వాతావరణంపై మాగుంట ప్రశ్న

ఒంగోలు: దేశంలో వివిధ వాతావరణ సమస్యలను నిరోధించేందుకు జీ20/అంతర్ ప్రభుత్వ ఫోరం సహకారం తీసుకోవడం, హరిత పారిశ్రామిక విధానం అనుసరించడం గురించి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పులు శాఖ సహాయక మంత్రి అశ్వినీకుమార్ చౌబే సమాధానం ఇచ్చారు. జాతీయ సౌరశక్తి, మెరుగైన సామర్థ్యం, స్థిరమైన నివాసం, నీరు, హిమాలయ పర్యావరణ వ్యవస్థను నిలబెట్టడం, హరిత భారతదేశం, స్థిరమైన వ్యవసాయ మరియు వ్యూహాత్మక జ్ఞానం విషయాల గురించి పనిచేస్తాయన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా సమగ్ర అభివృద్ధి వ్యూహాలపై కేంద్రం, రాష్ట్రాలు కూడా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకున్నాయన్నారు. అంతర్జాతీయ సహకారంతో వాతావరణ సమస్యలను నిరోధించడం వల్ల నష్టాల నివారణతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థ గణనీయంగా పెంపుదల జరుగుతుందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి వివరించారు.

ఎరువుల దుకాణాలపై కేసులు నమోదు

మార్కాపురం/పొదిలి: మార్కాపురం, పొదిలి పట్టణాలతోపాటు కొనకనమిట్లలోని పలు ఎరువుల దుకాణాల్లో గురువారం తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ రియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్న నాలుగు దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రియాజ్ తెలిపారు. వ్యాపారులు అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే తమకు సమాచారం అందించాలని రైతులకు సూచించారు. దాడుల్లో పొదిలి ఇన్‌స్పెక్టర్ మొహిసిన్ పాల్గొన్నారు.



పొదిలిలో తనిఖీ చేస్తున్న అధికారులు

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



మొహర్రం వేడుకలకు హాజరైన మద్దిశెట్టి రవీంద్ర, ఎంపీపీ, జెడ్పీటీసీ

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని వెలుగువారిపాలెం పంచాయతీ గంగపాలెం మొహర్రం వేడుకల్లో దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిశెట్టి రవీంద్ర పాల్గొన్నారు. గ్రామంలో గురువారం పీర్ల పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ముస్లిం నాయకులు డాక్టర్ మైసూర్ బాలాజీ, లాల్‌లు ఏర్పాటు చేసిన పీర్ల ఉత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, సర్పంచ్ బ్రహ్మారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, విజిలెన్స్ కమిటీ సభ్యులు అనిల్‌రెడ్డి, బెల్లంకొండవారిపాలెం, రజానగరం సర్పంచ్‌లు పోశం సుమలతా శ్రీకాంత్‌రెడ్డి, వలి, దర్శి కౌన్సిలర్ వీసీరెడ్డి, నాయకులు యలమందారెడ్డి, వెలుగువారిపాలెం మాజీ సర్పంచ్ ఓబులరెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో క్యాన్సర్ ప్రమాదం



మద్దిపాడులో ప్లాస్టిక్ వాడకంపై వివరిస్తున్న రిషి

మద్దిపాడు: ప్లాస్టిక్‌ను వాడటం వలన పర్యావరణం పాడైపోతుందని ఎన్‌ఆర్‌ఐ విద్యార్థి వివరించారు. కొణిజేడు గ్రామానికి చెందిన రిషి యూఎస్‌లోని సెయింట్ లూఈస్‌లో ప్లస్ 1 చదువుతున్నాడు. ప్లాస్టిక్ వాడకంపై ప్రచారం చేస్తూ ఇండియా వచ్చిన సందర్భంగా మద్దిపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించాడు. ప్రపంచం వ్యాప్తంగా ప్లాస్టిక్ వాడకంలో భారత్ నాలుగో స్థానంలో ఉందని.. దీని వలన క్యాన్సర్ వ్యాధి సులువుగా వచ్చే ఆవకాశాలున్నాయన్నారు. అందుకే స్టీలు వస్తువులు, జూట్ బ్యాగ్‌లు వాడుకోవాలని ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు ఇప్పటికే ప్లాస్టిక్‌ను నిషేధించాయని భారతలో కూడా ఉందన్నారు. కానీ ఇక్కడ వాడకం ఆపలేదన్నారు. ఇప్పటి వరకూ వాడి పడేసిన ప్లాస్టిక్ మొత్తాన్ని ప్యాక్ చేసి ఒంగోలు దగ్గరలో ఉన్న ప్లాస్టిక్ డీ గ్రేడబుల్ యూనిట్‌కు తరలించాలని సూచించారు. డిజిటల్ బోర్డు డెమో నిర్వహించారు. హెచ్‌ఎం ఎండీ అబ్దుల్ అజీమ్ , ఉపాధ్యాయులు పెద్దిరెడ్డి కోటిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నాకు తరలిరండి



మాట్లాడుతున్న పమిడి వెంకట్రావు

చీమకుర్తి: కారుమంచి మేజర్‌కు మరమ్మతులు చేయించాలని ఈనెల 31న ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమానికి తరలి రావాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు రైతులకు పిలుపునిచ్చారు. గురువారం చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో మండల స్థాయి రైతు సంఘం కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కారుమంచి కాలువ కట్ట మధుకాన్ క్వారీలోకి జారిపడి దాదాపు రెండు సంవత్సరాలైందని, అప్పటి నుంచి సాగర్ నీటిని కారుమంచి మేజర్ ద్వారా పంపించేందుకు ఆటంకంగా ఉందన్నారు. 20 గ్రామాల్లో దాదాపు 25 వేల ఎకరాలకు సాగర్ నీళ్ళు కారుమంచి మేజరు నుంచి రావాల్సి ఉందని, అధికారుల నిర్లక్ష్యం కారణంగా మరమ్మతులు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పీఎం కిసాన్ సమ్మాన్ నిధితో మేలు



ఉప్పుగుండూరులో మాట్లాడుతున్న పొద వరప్రసాదరావు

నాగులుప్పలపాడు: రైతులకు మంచి చేయాలన్న సంకల్పంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి కార్యక్రమం మొదలు పెట్టినట్లు పొగాకు బోర్డు సభ్యులు పొద వరప్రసాదరావు అన్నారు. గురువారం ప్రధానమంత్రి దేశ వ్యాప్తంగా ప్రారంభించిన మోడల్ ఎరువుల రిటైల్ దుకాణాల్లో భాగంగా మండలంలోని ఉప్పుగుండూరు గ్రోమోర్‌లో కేంద్రంలో ప్రధానమంత్రి సందేశం వినిపించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ఈ దుకాణాల ద్వారా రైతులకు కావాల్సిన నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు అందుబాటు ధరలలో అందించనున్నట్లు తెలిపారు. బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మీనా కుమారి, మండల కన్వీనర్ పెంట్యాల సుబ్బారావు, లచ్చం శెట్టి టీగ్రా, రాయపూడి సుదర్శన రావు, రైతులు పాల్గొన్నారు.

కత్తి పద్మారావుకు భారతరత్న ప్రకటించాలి

- ఏపీ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్‌బాబు



కేక్ కట్ చేస్తున్న ఏపీ ఆరోగ్య శ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్‌బాబు

ఒంగోలు: రాష్ట్ర దళిత ఉద్యమ నిర్మాత, మహాకవి, రచయిత డాక్టర్ కత్తి పద్మారావుకు భారతరత్న ప్రకటించాలని ఏపీ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్‌బాబు అన్నారు. గురువారం స్థానిక ప్రకాశం భవనం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద డాక్టర్ కత్తి పద్మారావు 70వ జన్మదినోత్సవం జరిగింది. కత్తిపద్మారావు అభిమానులు పెద్ద ఎత్తున బాణసంచా పేల్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ యాదాల అశోక్‌బాబు కేక్ కట్ చేసి కత్తి పద్మారావుకు శుభాకాంక్షలు తెలిపారు. కారంచేడు, చుండూరులో ఆధిపత్య కులాలు సృష్టించిన మారణహోమం చూసి చలించిపోయి తన ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసిన పద్మారావు దళిత ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. తన ఉపన్యాసాలతో ఎందరో దళిత నాయకుల్లో స్ఫూర్తిని నింపారని, జాతీయ స్థాయిలో ఎస్సీ, బీసీ రాజకీయనాయకులను ఏకం చేసి దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని సాధించిన గొప్ప ఉద్యమనాయకుడన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు పద్మారావు స్వగృహం లుంబినీ వనంలో 70వ జన్మదినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని దళిత నాయకులు పెద్ద ఎత్తున శనివారం కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కంకణాల ఆంజనేయులు, చిట్టిమాల సంపత్‌కుమార్, బల్లికురవ వెంకట్, చప్పిడి కోటేశ్వరరావు, ప్రభుదాస్, నాగార్జున, మురళి, పాలడుగు రమేష్, అంచిపోగు వెంకటేశ్వరరావు, దాసరి రాజ, రమేష్ , ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంవీఎస్ మాటలు మరచిపోలేరు



మిశ్రోను సత్కరిస్తున్న అభినయ కళాకారులు

ఒంగోలు టౌన్: మాటల రచయితగా అనేక సినిమాలకు ఎంవీఎస్ హరనాథ్ రాసిన డైలాగులను తెలుగు సినీ ప్రేక్షకులు ఎప్పటికీ మరిచిపోలేరని ఒంగోలు మార్కెట్ యార్డు చైర్మన్ కొఠారి రామచంద్రరావు అన్నారు. అభినయ 45వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో సినీ రచయిత ఎంవీఎస్ హరనాథ్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఎంవీఎస్ శిష్యులు గురుపూజ నిర్వహించారు. అనంతరం పొన్నూరు రసఝురి కళాకారులు ప్రదర్శించిన కాపలా, కరీంనగర్ చైతన్య భారతి కళాకారులు ప్రదర్శించిన చీకటిపువ్వు నాటికలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ఏడాది అభినయ పురస్కారాన్ని విశాఖపట్నానికి చెందిన ప్రముఖ నాటక రచయిత ఎస్కే మిశ్రోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు, ప్రముఖ కవులు కళాకారులు ఏ. మల్లేశ్వరరావు, పాటిబండ్ల ఆనందరావు, డా.నల్లూరి రంగారావు, పోకూరి వెంకటేశ్వరరావు, పసుపులేటి వెంకటరమణ, డీఎస్ ప్రసాద్ రెడ్డి, అంగలకుర్తి ప్రసాద్, అభినయ కార్యదర్శి దేనువకొండ సుబ్బయ్య, మంచాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.